౩౦

# సహనానికి సరిహద్దులు

ఆయన్నందరూ రంగనాధంగారు అని పిలుస్తారు.

అంటే-

ఆయన పేరు ఏ రంగనాధరావుగారో అయి వుండాలి.

ఆయన తెల్లగా పొడుగ్గా వుంటాడు- ఆజానుబాహువే అందాం, అంతే కాదు అరవింద దళాక్షుడు కూడాను.

అందుకే-

ఆయన స్ఫురద్రూపి అంటారు, ఆ వూరి పెద్దలంతా.

ఆయనెప్పుడూ తెల్లటి బట్టలేసుకొని టిప్టాప్‌గా గుర్రంమీద తిరుగుతాడు.

కనుక-

ఆయనేదో పెద్ద జమిందారే అయివుండాలి.

ఇప్పుడు...

ఆయన పేరు రాజా రంగనాధం గారని అన్నా మీరెవరూ తప్పు పట్టరు.

ఇదంతా  పాతికేళ్ల కిందటి మాట! ఆ రోజుల్లో....

రాజా వారి పేరుచెబితే పసిపిల్లలు పాలు తాగేవారు కారట!!

అంటే-

చండశాసనుడన్న మాటే! అన్నమాటేమిటి? అక్షరాలా నిజం. ఆరోజున వీరన్నను చెట్టుకు కట్టి, చర్మం చిల్లులు పడేదాకా, శ్రీవారికి చేతులు నొప్పులు పుట్టేదాకా? గొడ్డును బాదినట్టు బాదటం ఎవరైనా చూసి వుంటే; ఈ విషయంలో ఎలాంటి సందేహం వెలిబుచ్చరు. పైగా పరమదుర్మార్గుడని పబ్లిగ్గా అనక పోయినా, అనుకోకుండా మాత్రం వుండలేరు.

ఆ దుర్మార్గుడు ఇల్లు వదిలి మళ్లీ ఇంటికి చేరే వరకూ ఏమీ జరగలేదంటే ఆ రోజు చాలా పవిత్రమైందనే అనుకోవాలి.

ఆరోజు-

రాజకుమారుళ్ళా ముస్తాబయి రంగసాని దగ్గరకు బయల్దేరారు రాజావారు.

రంగసాని అసలు పేరు ఏమిటో ఎవరికీ తెలీదు. ఆవిడ అసలు పేరు ఏ రంగమ్మో అయి వుండవచ్చు. లేక రంగనాధరావు గారి ప్రాపు చేరాక రంగసాని అయిందో; ఏమైనా ఆమె పేరు విషయంలో ఇక్కడ మీమాంస అక్కర్లేదు. ఆమెను అంతా రంగసాని అంటారు అన్నదే మనకు ప్రస్తుతం.

సరే ఇక అసలు కథకు వద్దాం.

కనుచూపు మేరలో ఎక్కడా మరో మనషి మసిలే అవకాశం లేని వారి పొలాల మధ్య ఓ అందమైన భవంతి కట్టి, రంగసానిని అందులో రాచిలుకలావుంచుతున్నారు శ్రీ రంగనాధరావు గారు. ఆవిడమీద మనసు మళ్ళీ బయల్దేరిన శుభ సందర్భంలోనే ఈ దుస్సంఘటన జరిగింది.

ఎలాగంటే-

రాజా రంగనాధరావు గారి ప్రియురాలి భవంతికి వెళ్ళే మార్గంలో, పొలం గట్ల వెంబడి పైవూరుకు పోతూన్న వీరన్న కనిపించాడు. వీరి గుర్రం డెక్కల చప్పుడు వాడు వినలేదో ఏమో! వాడు తప్పుకుని దారివ్వలేదు. రాజాగారు తమని ఆ అనామకుడు గుర్తించనట్టు అభిమాన పడ్డారు. గుర్రం ఆపి కొరడాతో ఒకటిచ్చుకున్నారు కూడాను. అయినా వీరి గొప్పతనాన్ని వాడేం గుర్తించినట్టు అనిపించలేదు రాజావారికి.

"ఎవడ్రా నువ్వు?" అని గర్జించారు.

వాడు నిర్లక్ష్యంగా వెళ్ళమన్నట్టు సైగ చేశాడు.

"ఎంత పొగరు వీడికి?"

అక్కడే మరి కొంచెం అవతల నువ్వు చేలకు నీళ్ళు తోడుతోన్న పనివాళ్లు కనిపించారు. ఆజ్ఞాపించటమే తడవు వాణ్ణి చెట్టుకి కట్టారు.

ఎంత కొట్టినా మాట్లాడడేం! ఎంత పొగరు! కొట్టి కొట్టి చేతులు నొప్పులు పుట్టేక గుర్రం ఎక్కి తన గజ్జల గుర్రం వైపు దౌడుతీశారు రాజావారు.

కనుచూపు మేర పచ్చటి పైరు పొలాలు. పొలం గట్ల చుట్టూ కొబ్బరి మొక్కలు బోర్డర్లా ఎదిగి శ్రీ రంగనాధరావుగారి పొలంలో ఏలోటూ రాకుండా బతుకు సాగిస్తున్నందుకు గర్వంగా గాలిలో తలలు ఎగరేస్తున్నాయి.

ఆ పొలాల మధ్య పుంత, పుంతకి ఇరువైపులా తాడి మట్టలు, విచ్చు కత్తుల్లా... విరుచుకు పడబోతోన్న ప్రమాదంలా వున్నాయి. కొత్త గుర్రం ఒళ్ళు మరిచి పరుగెడుతోంటే, మరింత రెచ్చి పోయి కొరడాతో 'ఛెళ్ ఛెళ్' మని బాదుతున్నారు రాజావారు. విఠలాచార్య సిన్మాలో రాజకుమారుళ్ళా దౌడు తీస్తూ వుంటే - దుమ్ము చెట్ల మీద పొగ మంచులా పరుచుకుంటోంటే - 'అన్ ట్రెయిన్డ్ హార్స్' అంటారు - అందుకేనేమో! ఆ కొత్త గుర్రం దారి మాని పక్కనున్న తాటి మట్టల వైపు దౌడు తీసింది. అంతవరకే తెలిసింది శ్రీవారికి. అటుపై జరిగిందంతా వారి తెలివికి అతీతంగా జరిగిందే.

తెలివి వచ్చేటప్పటికి ఒళ్లంతా కట్లుతో ఇంట్లో పక్కమీద పడివున్నారు. కదలబోతే కలుక్కున దెబ్బలన్నీ కత్తుల్లా పొడిచాయి.

"ఏమిటిది?" అడిగారు అమాయకంగా. మాటకూడా ఏదో నీరసంగానూతిలో గొంతులా రావటం ఆయనక్కూడా ఆశ్చర్యం కలిగించింది.

"తవరు గుర్రం మీంచి పడిపోయారండి. ఒళ్ళంతా తాటి మట్టల్లో చీరుకు పోయిందండి" అన్నాడు మంగలి సుబ్బన్న.

"నాకు తెలీదే?"

"తఁవరికి స్పృహ లేదండి"

"మరిక్కడికెలా వచ్చాను?"

"వీరడు మోసుకొచ్చాడండి"

"ఎవడా వీరడు?"

"వాడో దిక్కులేని వాడండి. వూరూరా తిరిగి అడుక్కుంటూ వుంటాడు."

"వాణ్ని పిలిపించండి" ఆజ్ఞాపించారు.

"ఎక్కడున్నాడో ఏమో! ఎక్కడని వెతుకుతాం."

"ఈ దేశంలోనే వుంటాడా?"

"తఁవరు కోప్పడితే ఏమీ చెప్పలేనండి. వాడు అడుక్కునే వాడండి. వాడికో చోటని లేదు. అందుకని అలాగ మనవి చేసుకున్నానండి. ఈ వూళ్ళోనే ఎక్కడో వుండి వుంటాళ్లెండి."

"మరేం ఒళ్ళు తీటా వెతకడానికి?"

"చిత్తం"

"ఏమిటి"

"క్షమించండి, అలాగే వెతికి పట్టుకొస్తానండి."

వెతక్క తప్పలేదు.

ఊళ్ళోనే వుంటాడని విశ్వసించిన వాళ్ళు పక్క ఊళ్ళో కూడా పట్టుకోలేక పోయారు వీరన్నని, నాలుగు రోజుల తర్వాత ఎలాగో పట్టుకుని రాజావారి ముందు హాజరు పరిచారు.

వీరన్నను చూడగానే నిప్పులు కురిసే ఆ కళ్ళ నుంచి నీళ్ళు కారాయి.

"కూర్చో"

వాడు కూర్చోలేదు.

"తప్పు బాబు గారూ, తమరి ముందు కూర్చో కూడదు" అన్నట్టు సైగ చేశాడు భయం భయంగా. అప్పటికి కొంత వరకూ అర్థమైంది రాజా వారికి.

"వీడికి మాటల్రావా?"

"పాపం మూగవాడండి" చెప్పాడు సుబ్బన్న.

ఆ మాట విన్నాక పూర్తిగా అర్థమైంది. పశ్చాత్తాపంతో రాజావారి కడుపు దేవి నట్టయింది.

ఇదంతా వెనకటి గాథ.

ఇప్పుడు రాజావారి కథే మారిపోయింది.

వెర్రి వీరన్న ఇప్పుడు రంగనాధరావు గారి ఆంతరంగిక సలహాదారు. ఎవరికీ అర్థం కాకుండా ఆయనకు మాత్రమే తెలిసేట్టు చెప్పగలిగే భాష వీరన్నకుంది. వీరన్న ఎలా చెప్పినా అర్థం చేసుకోగలిగే ప్రజ్ఞా పాటవాలూ అలవడ్డాయి రంగనాధరావు గారికి. దాంతో వారి వ్యవహారాల్లో చాలా మార్పులు వచ్చాయి. అందులో మొట్ట మొదటిది రంగసానిని తన్ని తరిమెయ్యటం.

అదెలా జరిగిందంటే-

ఓసారి రంగనాధరావు గారు గ్రామాంతరం వెళ్లటం జరిగింది. ఈ తరుణంలో వారి ఆంతరంగికుడు శ్రీ వీరన్న గారు పొలం పర్యవేక్షణకు వెళ్ళారు. అదే సమయంలో రంగసాని జాతకం మూడి రంగనాధరావుగారి ఏకైక పుత్రుడితో సరసాలాడటం అతగాడి కంటపడింది. అంతే! రంగనాధరావు గారు వూరుకి తిరిగి రాగానే "ఆమెను వెంటనే పంపెయ్యండి"అన్నాడు వాడి భాషలో.

ఎందుకని ఎదురు ప్రశ్న వెయ్యలేదు. రంగసాని కట్టుబట్టల్తో వెళ్ళిపోవాల్సి వచ్చింది. రంగసాని నిష్క్రమణకు వీరన్నే కారణం అని తెలిశాక రాజావారి బంధు

వర్గంలో వీడో సి.ఐ.డి అయిపోయాడు. అంతకు ముందు వాడంటే మండిపడే అమ్మగారికే వాడంటే ఎనలేని గురి ఏర్పడింది. ఒకప్పుడు వీరన్న అంటే ఆమెకు చెప్పలేని కోపం.

ఎందుకంటే-

వీరన్నని కొత్తగా అక్కడికి తెచ్చిన రోజుల్లో వాడికి వీధిలో భోజనం పెట్టేవారు. ఒక రోజు కూరకు బదులు ఒట్టి ఆవకాయ పచ్చడితోనే భోజనం పెట్టినందుగ్గాను రాజా వారికి భాషలేని ఫిర్యాదు వెళ్ళింది. దాంతో రాజావారు మండిపడి వంట మనిషిని జువ్వ కఱ్ఱతో బాదారు. అడ్డంవచ్చిన అమ్మ గారికీ తప్పలేదు. అప్పట్నుంచీ వీరన్న అంటే ఆమె గారికి ఎక్కడలేని కోపం.

ఇక వారి వ్యవహారాల్లో జరిగిన రెండో మార్పు-

దుబారా ఆగిపోవటం, ఏటా రెండెకరాలు తరగటం మొదలెట్టిన రాజా వారి ఆస్తి ఆకస్మికంగా ఆగిపోయింది. కొంత కాలం అలా నిలిచి ఆ తర్వాత మళ్ళీ పెరగటం ఆరంభించింది.

ఇక అసలు మార్పు మౌలికమైంది.

అదే రాజావారు నైతికంగా మారిపోవటం. అకారణంగా కోప్పడటం, పేదవాళ్ళని హింసించటం, ఇలాంటి వన్నీ కలలోని విషయాలుగా మారిపోయాయి. పైగా పేదవాళ్లంటే ఎక్కడలేని ప్రేమా పుట్టుకొచ్చింది. అందుకూ ఓ కారణం లేకపోలేదు.

అదేవిటంటే-

రాజావారు గుఱ్ఱం మీంచి పడిపోయినప్పుడు చూసినవారిలో తమ దాయాదులూ వున్నారుట. కాని వారెవరూ ఆయన్ని లేపి ఇంటికి చేర్చే ప్రయత్నమే చేయలేదుట. అడుక్కుతినే వీరడు, అందులోనూ అప్పటి వరకూ తనచేత చావుదెబ్బలు తిన్నవాడు, వాడికే ఎందుకు తనని కాపాడాలనే ఆలోచనవచ్చింది? అంటే వాళ్ళలో మానసికమైన క్షమ, ఆదరణ సహజంగానే వున్నాయన్న మాట! వాళ్ళే అసలైన మానవులు- ఇలా తర్కించుకుని చివరికి వాళ్ళమీద ప్రేమని పెంచుకున్నారు.

రాజా రంగనాధరావు గారి వ్యవహారాల్లో ఇన్ని మార్పులు తెచ్చిన ఆ అనామకుడు అర్ధాంతరంగా ఒకనాడు కాలం చేశాడు. అదీ మామూలు చావు కాదు. దారుణ హత్య. నోరు లేని ఆ అమాయకుణ్ణి చంపటానికి చేతులెలా వచ్చాయోనని వాపోయారు జనం. పొలంలో, వరి నూర్పుల కళ్ళం దగ్గిర అతని శవం రక్తపు మడుగులో పడి వుండటం అనేక అనుమానాలకి దారి తీసింది. ఎవరైనా ధాన్యం

తస్కరించబోతుంటే వీరన్న వారించి వుండవచ్చు, లేదా దోపిడీదార్ల ఆటలు కట్టించినందుకు కసితో పనివాళ్ళే ఎవరైనా చంపి వుండవచ్చు. ఎంత మందికి ఎన్ని అనుమానాలు వున్నా రంగనాధరావు గారికి వుండాల్సిన అనుమానం వేరే వుంది. రెండు నెలలు నిద్రాహారాలు మాని ఆ అనాధ భిక్షుకుడి కోసం ఏడ్చాడాయన.

ఇది జరిగి అప్పుడే అయిదారేళ్ళు కావస్తోంది. వెర్రి వీరన్నను చాలా వరకూ మర్చిపోతున్న తరుణంలో, అతన్ని మర్చిపోకుండా చేసే సంఘటన ఒకటి జరిగింది. అదే - రంగనాధరావు గారికి మనవడు పుట్టటం. మనవడికి ఎంత కాలానికీ మాటలు రాక పోయేప్పటికి వీరన్న వారినీ వారి కుటుంబాన్నీ వొదిలి వెళ్లలేక మనవడి రూపంలో తిరిగి వచ్చాడనే బలమైన సెంటిమెంటును పెంచుకున్నారు రంగనాధరావు గారు. ఆ సెంటిమెంటు ఎంతవరకూ దారితీసిందంటే ఆ మూగవాణ్ణి ఇయన్టీ స్పెషలిస్టుకు చూపించాలంటే ఇష్టపడనంతవరకూ వెళ్ళింది. ఆ విషయంలో తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం పెరిగింది.

"నాన్నగారూ! మీ చాదస్తం చాలా దూరం పోయింది. మీకు మీ భక్తుడు వీరన్న అంటే అభిమానం ఉండవచ్చు, కాదనను. కాని వాణ్ణి నాకొడుకులో చూసి సంతృప్తి పడాలనే ఆలోచనని నేను సహించను. నా కొడుకును మూగవాడిగా చూడలేను."

"మూగవాడూ మనిషే. అందులోనూ మామూలు మనిషికంటే గొప్పవాడు." అన్నారు.

"నాకు సహనం చచ్చిపోతోంది, నా కొడుక్కి ఆపరేషన్ చేయించక తప్పదు. మీరీ విషయం బాగా ఆలోచించాలి."

"అక్కర్లేదు. నేను బతికి వుండగా మాత్రం అది జరగదు."

"అదీ నిజమే"

"అవును అదే నిజం."

అదే నిజమైంది. ఆ మర్నాటి వుదయం రంగనాధరావు గారు మరి లేవలేదు. ఎందుకు లేవలేదనేది ఆ యింట్లో ఇద్దరికే తెలుసు.

*(ప్రజాతంత్ర, 15-5-1977)*